క్లుప్తంగా

ఎల్‌ఐసీ ఏజెంట్ల నిరసన



నిరసన తెలుపుతున్న ఏజెంట్లు

పార్వతీపురంటౌన్‌: ఎల్‌ఐసీ ఏజెంట్ల డిమాడ్లు నెరవేర్చాలని కోరుతూ పట్టణంలోని ఎల్‌ఐసీ ఆఫీస్‌ వద్ద మంగళవారం పలువురు ఏజెంట్లు ధర్నా చేశారు. ఇన్సూరెన్స్‌ సంస్థ కొత్తగా ప్రవేశ పెట్టిన నిబంధనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కొత్త నిబంధనల వల్ల ఏజెంట్లు, పాలసీదారులు నష్టపోతారని వాపోయారు. గతంలో ఉన్న పాత విధానాలనే కొనసాగించాలని కోరారు.

ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన



ఆస్పత్రి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్‌: జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి ఎదురుగా నిర్మిస్తున్న మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను ఎమ్మెల్యే విజయచంద్ర మంగళవారం పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. నాణ్యతలో రాజీపడొద్దని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి ప్రారంభమైతే ఈ ప్రాంత ప్రజలకు సూపర్‌ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, రిఫరల్‌ కేసులు తగ్గుతాయని అన్నారు. జిల్లా కేంద్రంలో వైద్యశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.

80 మందికి ఉచిత నేత్ర పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్‌ గీతాప్రియ

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో సత్యసాయి మందిరం వద్ద మంగళవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో శ్రీకాకుళం రాగోలు జెమ్స్‌ హాస్పిటల్‌ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 80 మందికి కంటి పరీక్షలు చేశారు. 25 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు వైద్యాధికారి గీతాప్రియ తెలిపారు. మిగిలిన వారికి అవసరమైన మందులు అందజేశారు. శస్త్రచికిత్సలకు ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్‌ చేయడంతో పాటు మందులు, కళ్లద్దాలు అందివ్వడం జరుగుతుందని క్యాంప్‌ కోఆర్డినేటర్‌ వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో జి.శ్రావణ్‌కుమార్‌, కె.గౌరీనాథ్‌ పాల్గొన్నారు.

గంజాయి, సారాలపై ఉక్కుపాదం

- ఎస్పీ మాధవరెడ్డి



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

సాలూరు: గంజాయి, సారాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. సాలూరు రూరల్‌, మక్కువ పోలీస్‌ స్టేషన్లను మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి పెండింగ్‌ కేసులపై ఆరాతీశారు. స్టేషన్‌ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలని, ప్రజలతో స్నేహపూర్వకం(ఫ్రెండ్లీ పోలీస్‌)గా నడచుకోవాలని సూచించారు. అనంతర స్టేషన్‌ ఆవరణలో సబ్‌డివిజనల్‌ పోలీస్‌ ఆఫీసర్‌ అంకితా సురానాతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


సచివాలయ ఉద్యోగికి మెమో



రికార్డులను తనిఖీ చేస్తున్న మున్సిపల్‌ కమిషనర్‌ సత్యనారాయణ

సాలూరు: పట్టణంలోని సచివాలయం-2లో విధులు నిర్వహిస్తున్న వార్డు టౌన్‌ప్లానింగ్‌ సెక్రటరీ మహేష్‌కు మెమో జారీచేసినట్లు మున్సిపల్‌ కమిషనర్‌ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని 2,3 వార్డు సచివాలయాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. ఎటువంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన టౌన్‌ప్లానింగ్‌ సెక్రటరీ మహేష్‌కు మెమో జారీచేశారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.

- చివరిదశకు చేరుకున్న ఖరీఫ్‌ వరిసాగు
- పంటకోతలకు సన్నద్ధమవుతున్న రైతులు
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై రాని స్పష్టత



వెంకటాపురంలో కోతదశకు చేరుకున్న వరిచేను

కోతకు సిద్ధం.. కొనుగోలు కేంద్రాల ఏర్పాటే ఆలస్యం

సీతానగరం: మండలంలో ఖరీఫ్‌ వరిసాగు కోతదశకు చేరుకుంది. పంటకోతలు చేపట్టేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసినట్లయితే వారికి మేలు జరుగుతుంది. లేదంటే దళారులు రంగంలోకి దిగి అన్నదాతను దోచుకునే అవకాశం ఉంది.

● 16వేల ఎకరాల్లో వరిసాగు

ఈ ఏడాది ఖరీఫ్‌లో సీతానగరం మండలంలో సుమారు 16,552 ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో దిగుబడి కూడా బాగుంటుందని రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది నీటి ఎద్దడిని, తెగుళ్లను తట్టుకునే ఎంటీయూ 1064, ఎంటీయూ 1161, బీపీటీ 3291, సాంబమసూరి, తదితర రకాల విత్తనాలను వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అందజేశారు. ఖరీఫ్‌ ప్రారంభంలో వాతావరణం అనుకూలంగా ఉండటంతో అనేక మంది రైతులు వెదజల్లు పద్ధతిలో విత్తనాలు వేసుకున్నారు. నీటి వనరులు అందుబాటులో ఉన్న రైతులు నాట్లు విధానంలో వరిసాగు చేశారు. ప్రస్తుతం వెద పొలాలు పంటదశకు చేరుకున్నాయి. రైతులు ధాన్యం కూడిక పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ఏర్పాటు చేయకపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది.

● ముందస్తు ప్రణాళికలు

వ్యవసాయశాఖ, గణాంకశాఖ సిబ్బంది పంటకోత ప్రయోగాలు చేపట్టి దిగుబడి అంచనా వేసేందుకు సిద్ధమయ్యారు. దిగుబడి ఆధారంగా ప్రభుత్వం ధాన్యం సేకరణ చేపట్టనుంది. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో వీలైనంత త్వరగా డబ్బులు జమ చేసేలా, కళ్లాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించే వాహనాలను ట్రాక్‌ చేసేందుకు వీలుగా వాటికి జీపీఎస్‌ పరికరాలను అమర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు



మండలంలోని 2024-25 ఖరీఫ్‌ సీజనులో రైతులు సాగు చేస్తున్న వరిపంటను ఈ-పంటలో నమోదు చేశాం. ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉంది. పంటకోత ప్రయోగాలు చేపట్టేందుకు సన్నద్ధమయ్యాం. మండలంలోని 18 రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

– ఎస్‌.అవినాష్‌, మండల వ్యవసాయాధికారి, సీతానగరం

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మండలంలోని చాలా గ్రామాల్లో ఖరీఫ్‌ వరిచేను కోత దశకు చేరుకుంది. పంటకోతలకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యం సేకరించాలి. సకాలంలో రైతుల బ్యాంకు ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఎ.తిరుపతినాయుడు, రైతు, గెడ్డలుప్పి గ్రామం

అందరి భాగస్వామ్యంతోనే సుందర పార్వతీపురం సాధ్యం

- కలెక్టర్‌ ఎ.శ్యామ్‌ప్రసాద్‌



అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్‌ శ్యామ్‌ప్రసాద్‌

పార్వతీపురం: అందరి భాగస్వామ్యంతోనే పార్వతీపురం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్‌ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పట్టణ సుందరీకరణపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించడం, చెత్తసేకరణ, పారిశుద్ధ్య నిర్వహణపై చర్చించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. పిల్లల కోసం చిల్డ్రన్‌పార్కులు ఏర్పాటు చేయాలన్నారు. జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మన పార్వతీపురం లోగో, సెల్ఫీ పాయింట్లు, డిజిటల్‌ బోర్డులను ఏర్పాటు చేయాలని, గిరిజన సంస్కృతిని ప్రతిబింబించేలా సవర ఆర్ట్స్‌తో కూడిన చిత్రాలను, ప్రజలను చైతన్యపరిచే చిత్రాలను వేయించాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాలను మరింత అందంగా తీర్చిదిద్దాలి

జిల్లాలోని 516 అంగన్‌వాడీ కేంద్రాలను మరింత అందంగా తీర్చిదిద్దాలని ఐసీడీఎస్‌ అధికారులను కలెక్టర్‌ ఆదేశించారు. కేంద్రాల లోపల, వెలుపల నిర్దేశించిన రంగులను వేయాలన్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రానికి వెలుపల అందరికీ కనిపించేలా నేమ్‌ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రానికి అవసరమైన ఫర్నీచర్‌ను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కేంద్రానికి వచ్చే పిల్లలు చదువుకునేందుకు మంచి వాతావరణం కల్పించాలని సూచించారు. సమావేశంలో ఐసీడీఎస్‌ పీడీ ఎంఎన్‌ రాణి, డీఈఓ జి.పగడాలమ్మ, జిల్లా అధికారులు, సీడీపీఓలు పాల్గొన్నారు.

విశ్వశాంతి హోమం

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నదీతీరాన వెలసిన వేణుగోపాలస్వామి, లక్ష్మీనృశింహస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వశాంతి శ్రీమద్‌ భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞాన్ని మంగళవారం నిర్వహించారు. అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వారం రోజుల పాటు పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.



హోమ పూజలు ప్రారంభిస్తున్న పీఠాధిపతులు, అర్చక బృందం

పెద్దింపేటలో దాహం కేకలు

బలిజిపేట: మండలంలోని పెద్దింపేట గ్రామంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. తాగునీటి కోసం గ్రామస్తులు పొలాల్లో ఉన్న బోరుబావులను ఆశ్రయిస్తున్నారు. పొలంగట్ల మీదుగా తాగునీరు తెచ్చుకునేందుకు నానా అవస్థలు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలోనే పరిస్థితి ఇలా ఉంటే వేసవిలో ఇంకెంత దారుణంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ గ్రామవీధుల్లో ఖాళీ బిందెలతో మహిళలు మంగళవారం నిరసన తెలిపారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఉపాధిహామీ పథకానికి రాజకీయ గ్రహణం

- నిబంధనలు పాటించని అధికారులు చట్టపరమైన చర్యలు ఎదుర్కోక తప్పదు
- గోశాలల మంజూరుపై విచారణ చేపట్టాలి
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న పీడిక రాజన్నదొర

సాలూరు: కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో రెడ్‌బుక్‌ రాజ్యాంగం నడుస్తోందని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి కొందరు అధికారులు తూట్లు పొడుస్తున్నారని మాజీ డిప్యూటీ సీఎం, మాజీ గిరిజన సంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర విమర్శించారు. మండలంలో ఉపాధిహామీ పనులు విషయంలో అధికారుల తీరుపై ఎంపీపీ గరుగుబల్లి రాములమ్మ, వైస్‌ ఎంపీపీ రెడ్డి సురేష్‌, ఎంపీటీసీలు మంగళవారం రాజన్నదొర దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి కల్పించేందుకు అమలు చేస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ పథకానికి కూటమి ప్రభుత్వంలో రాజకీయ గ్రహణం పట్టిందన్నారు. ఉపాధిహామీ పనుల నిర్వహణకు స్థానిక సర్పంచ్‌ల ఆమోదం లేకుండా నేరుగా ఎంపీడీఓలు కాంట్రాక్టర్లతో ఒప్పందాలు చేయించుకుంటున్నారని, ఇది ఉపాధిహామీ చట్టం-2005కు విరుద్ధమని పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే అధికారులు ఎంతటివారైనా న్యాయస్థానాల ముందు దోషులుగా నిలబడక తప్పదని హెచ్చరించారు. అటువంటి అధికారులను గుర్తించి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు.

అధికారులు క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోక తప్పదు

ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను విస్మరించి, అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేసే అధికారులు క్రమశిక్షణా చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. మండలానికి మంజూరైన గోశాలల కేటాయింపు విషయంలో సచివాలయాల వారీగా జనాభాను పరిగణలోకి తీసుకుని అమలు చేయాలన్నారు. గ్రామసభల్లో చర్చించని, తీర్మానించని విషయం ఏదైనా ఉంటే మరోసారి గ్రామసభ నిర్వహించి తీర్మానించాలే తప్ప, గడిచిన గ్రామసభ తీర్మానాల్లో నమోదు చేయాలనడం, పంచాయతీల తీర్మానం అవసరం లేదని చెప్పడం పద్ధతికాదన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌, డ్వామా పీడీ విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సారిక, ఇరత పంచాయతీల్లో కనీసం గొర్రెలు, మేకలు, పశువులు లేనివారికి కొందరికి గోశాలలు మంజూరు చేశారని అక్కడే ఉన్న కోఆప్షన్‌ సభ్యుడు పాస్టర్‌ సువార్తరావు తెలుపగా, ఇలా ఎక్కడెక్కడ జరిగాయో తెలుసుకుని జాబితా ఇస్తే కలెక్టర్‌ దృష్టికి తీసుకువెళ్దామని రాజన్నదొర వారితో అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు త్రినాథ, సీతారాం, సువ్వాడ భరత్‌శ్రీనివాస్‌, వేణు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్‌ టి.జగన్మోహనరావు



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్‌ జగన్మోహనరావు

పార్వతీపురం టౌన్‌: విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు కృషి చేయాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్‌ టి.జగన్మోహనరావు అన్నారు. కొత్తవలస కేపీఎం ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు, వైద్యసిబ్బందిని ఆరాతీశారు. ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, వారిలో ఎంతమందికి హిమోగ్లోబిన్‌ పరీక్షలు చేశారు, ఎంతమంది రక్తహీనతతో బాధపడుతున్నారు, వారిలో రక్తహీనత నివారణకు ఏం చర్యలు తీసుకున్నారు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఐరన్‌-ఫోలిక్‌ యాసిడ్‌ మాత్రలను వారంలో ఒకసారి విద్యార్థులతో వేయించాలని, రక్తహీనతతో బాధపడుతున్న వారికి ప్రతిరోజు వేయించాలని సూచించారు. కిశోరీ బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే తెలియజేయాలన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య అవగాహన

వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీజనల్‌ వ్యాధులు, వాటి లక్షణాలు, రోగనిరోధక శక్తిని ఎలా పెంపొందించుకోవాలి తదితర అంశాలను వివరించారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వై.అప్పలనాయుడు, సూపర్‌వైజర్‌ ఇందిర, జయగౌడ్‌, వైద్య సిబ్బంది కిరణ్‌ కుమారి, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

సాలూరు: విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పట్టణ సీఐ అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, డ్రగ్స్‌, నూతన చట్టాలు, ట్రాఫిక్‌ నిబంధనలు, సైబర్‌ నేరాలు, తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. హెల్ప్‌లైన్‌ నంబర్లు, వాటి ఆవశ్యకతను వివరించారు. విద్యార్థినులు ఉన్నత విద్య అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఏసీ తహసీల్దార్‌గా ఉమామహేశ్వరరావు

సీతానగరం: మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉమామహేశ్వరరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు తహసీల్దార్‌గా పనిచేసి న కె.ప్రసన్నకుమార్‌ దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో హెచ్‌డీటీగా ఉన్న ఉమామహేశ్వరరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యత లు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ ..ప్రజలకు మెరుగైన సేవలందించడంతో పాటు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

సీతానగరం: మండలంలో ఉపాధిహామీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమరావు అన్నారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో మంగళవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ ఏపీఓ భాను ఆధ్వర్యంలో ఉపాధి టీఏలు, ఎఫ్‌ఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో ఇంకుడు గుంతలు, పాఠశాలల ప్రహరీలు, కల్వర్టులు, రహదారుల పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఆయా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఉపాధి నిధులతో నాటిన మొక్కల సంరక్షణపై సిబ్బంది దృష్టిసారించాలని సూచించారు. సమావేశంలో ఇంజినీరింగ్‌ అధికారి కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి ఏపీఓపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు

సాలూరు: మండల ఉపాధిహామీ పథకం ఏపీఓ రామకృష్ణపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేస్తూ మండల ప్రాదేశిక సభ్యులు తీర్మానం చేశారు. తీర్మాన కాపీలను జిల్లా కలెక్టర్‌, డ్వామా పీడీలకు పంపించారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ జి.రాములమ్మ అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీలు త్రినాథనాయుడు, సూరప్పలనాయుడు, సుబ్బారావు, సీతారం, తదితరులు మాట్లాడుతూ.. ఉపాధి హామీ ఏపీఓ రామకృష్ణ స్థానిక ప్రజాప్రతినిధులను గౌరవించడం లేదని, శాఖాపరమైన ప్రభుత్వ కార్యక్రమాల సమాచారాన్ని తమకు తెలియజేయడం లేదని ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల మంజూరైన గోశాలల కేటాయింపు విషయంలో పంచాయతీల తీర్మానాలు లేకపోయినా ఆగస్టు 23న జరిగిన గ్రామసభ తీర్మానాల్లో చేర్చాలని పీడీ ఆదేశించినట్లు పంచాయతీ కార్యదర్శులపై వాయిస్‌ మెసేజ్‌లతో ఒత్తిడి చేస్తున్నారన్నారు. వైస్‌ ఎంపీపీ రెడ్డి సురేష్‌ మాట్లాడుతూ.. గోశాలల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగిందన్నారు. పశుసంపద లేనివారికి గోశాలలు కేటాయించారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులకు తెలపకుండా జీగిరాం, సారిక తదితర సచివాలయాల పరిధిలో రాజకీయ ఒత్తిళ్లతో టీడీపీ కార్యకర్తలకు కేటాయించారని ఆరోపించారు. పల్లె పండుగ కార్యక్రమంలో ఉపాధిహామీ పనులకు సంబంధించి కొన్ని పంచాయతీల్లో సర్పంచ్‌లు రాకుండానే అధికారులు కొబ్బరికాయలు కొట్టి కార్యక్రమం ముగించుకుని అక్కడ నుంచి వెళ్లిపోయారని, దీనిపై ప్రశ్నిస్తే మీకు నచ్చింది చేసుకోమని అంటున్నారని వాపోయారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ సువ్వాడ గుణవతమ్మ, కోఆప్షన్‌ సభ్యుడు సూర్యనారాయణ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలతో దిగుబడి అంచనా



మాట్లాడుతున్న కృషీవిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసరాజు

సీతానగరం: పంటకోత ప్రయోగాలతో దిగుబడులు అంచనా వేయవచ్చని కృషీవిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసరాజు అన్నారు. మండలంలోని లక్ష్మీపురం, పెదబోగిలి, సీతానగరం గ్రామాల్లో ఏఓ ఎస్‌.అవినాష్‌ ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలను ఇప్పటికే ఈ-క్రాప్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. పంటకోత దశకు చేరుకున్నందున ఎంపిక చేసిన పొలాల్లో పంటకోత ప్రయోగాలు చేపట్టనున్నట్లు చెప్పారు. పంటకోత ప్రయోగాల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. శాస్త్రవేత్త అమృతవాణి పంటల సాగులో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ ఎస్‌.అవినాష్‌ మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు పంపిణీ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌ టి.సత్యవతి, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న ఏఎస్‌ఐ గంటా శ్రీనివాసరావు

సీతానగరం: దేశ ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసి అమరులైన పోలీసు కుటుంబాలను గౌరవించాలని, అమరవీరుల త్యాగాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలి ఏఎస్‌ఐ గంటా శ్రీనివాసరావు అన్నారు. పోలీస్‌ సమస్మరణ దినోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో పోలీసుల విధులు, విధి నిర్వహణలో వారు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, వారి త్యాగాలను విద్యార్థులకు వివరించారు. అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ, వారి కుటుంబాల్లో మనోధైర్యాన్ని నింపేందుకు ప్రతి ఏటా సమస్మరణ దినోత్సవాలను జరుపుకుంటున్నట్లు చెప్పారు. యువత దేశ సేవకు ముందుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌సీలు, పీసీలు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్షయపాత్రకు అప్పగించొద్దు

పార్వతీపురంటౌన్‌: గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలలో, కళాశాల వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు అక్షయ పాత్ర సంస్థ ద్వారా భోజనాలు సరఫరా చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే ఉపసంహరించుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇదే జరిగితే గిరిజన విద్యార్థులకు పౌష్టికాహారం మరింత దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డైట్‌ చార్జీలు పెంచకుండా, సరిపడా వర్కర్లు లేకుండా, సరైన పర్యవేక్షణ చేయకుండా ఒకటి, రెండు పాఠశాలలో జరిగిన కలుషిత ఆహార ఘటనలు చూపించి పేద గిరిజన విద్యార్థులకు నష్టం చేసే ఆలోచన చేయడం ఏమాత్రం సరైంది కాదని స్పష్టం చేశారు. ఈ ఆలోచన మానుకోకపోతే పోరాటాలు తప్పవని హెచ్చరించారు.

ఆ రెండు మద్యం షాపులు ఎత్తివేయాలి



మద్యం షాపులను పరిశీలిస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

బలిజిపేట: మండల కేంద్రమైన బలిజిపేటలో నారాయణపురం రోడ్డులో ఏర్పాటుచేసిన రెండు మద్యం షాపులను వారం రోజుల్లో ఎత్తివేయాలని పార్వతీపురం ఎక్సైజ్‌ శాఖ సూపరింటెండెంట్‌ జీవన్‌కిషోర్‌ ఆదేశించారు. బలిజిపేటలో ఏర్పాటుచేసిన మద్యం షాపులను మంగళవారం ఆయన పరిశీలించారు. గుడి, బడి, జనసంచారాల మధ్య మద్యం షాపులను ఏర్పాటు చేశారనే ఫిర్యాదులు అందడంతో వాటిని పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. ఏరియల్‌ సర్వే ప్రకారం నారాయణపురం రోడ్డులో ఉండే షాపు నంబరు 1,5లు స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయానికి 100మీటర్ల లోపు ఉండడంతో వాటిని ఎత్తివేయాలని యాజమాన్యానికి సూచించడం జరిగిందన్నారు. బలిజిపేట ఉన్నత పాఠశాలకు సమీపంలో ఏర్పాటుచేసిన షాపులను ఏరియల్‌ సర్వే ద్వారా గుర్తించగా నిబంధనలకు లోబడి ఉన్నందున వాటిని తొలగించాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో సీతానగరం ఎస్‌హెచ్‌ఓ డి.పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.